మరిడయ్య ఆశగా చూశాడు. అల్లంత దూరాన యిద్దరు మనుషులు గబగబా వస్తున్నారు.

ఒకఆడమనిషి ఒక మగమనిషి.

వాళ్ళు గుండెలు అలిసిపోయేలాగ మైలు దూరంనుంచీ పరుగు పరుగున వస్తున్నారు.

ఆడమనిషి పచ్చ చీర గావును కట్టుకుంది. ఆకుపచ్చ చీర. ఆ మనిషి చేతుల్లో ఒక మగపిల్లాడు వున్నాడు.

మగమనిషి చిన్న పంచెగుడ్డ కచ్చాపోసి కట్టుకున్నాడు. తువ్వాలుగుడ్డ ముక్కో, చీరముక్కో తలపాగా చుట్టుకున్నాడు. కాదు బుర్రకు అడ్డదిడ్డంగా చుట్టేసుకున్నాడు. బుజంమీద ఒక పాత, చినుగుల పంచపాత, నల్లగా వున్నాడు. దిమిరి పొడుగు మనిషి లాగ పొడుగ్గా పలుచగా వున్నాడు. వాళ్ళు గోర్జు దాటి మట్టిరోడ్డెక్కారు.

రోడ్డు చితుకు చితుకూ మంటున్నాది.

మూడురోజులాయి చినుకులు. కురవవు, మానవు. ఈ మూడు రోజుల్లూ, పొద్దే పొడవలేదు. కారునల్లని మబ్బులు మృత్యువు లాగ కమ్ముకొచ్చేస్తున్నాయి.

ఆడమనిషి, తన చేతుల్లో వున్న మగపిల్లణ్ణి— మగమనిషికిచ్చింది.

మగమనిషి చుట్టపారేసి రిక్షాలోంచి దిగాడు.

సందేహంలేదు పట్నం బేరమే. ఒక రూపాయి డబ్బులు దొరికాయన్నమాట.

మరిడయ్యకు పొద్దుణ్ణుంచీ డబ్బులబేరం రాలేదు.

బోణీబేరం పెద్దనాయుడిది. పట్నం తీసుకెళ్ళేడు. ఆ నాయుడు శ్రీరాజా టాకీస్ దగ్గిర దిగిపోయాడు. దిగిపోయి జేబులోంచి వో చుట్ట తీసి మరిడయ్య కిచ్చాడు. డబ్బులన్నట్టు చూశాడు మరిడయ్య, బుర్ర గోక్కుంటూను.

"తీసుకుందూగాన్లే" అన్నాడునాయుడు. అని గబగబా వెళ్ళిపోయేడు.

"చిత్తం" అన్నాడు మరిడయ్య. నాయుడు తప్పకుండా డబ్బులిచ్చేస్తారు. కాని యిప్పుడు కాదు మరి.

నిన్నటి డబ్బుల్లోవి పది పైసలు మిగిలాయి. టీ తాగుదాం అనుకున్నా మరో అయిదు పైసలు కావాలి. మరో రిక్షావాణ్ణి అగ్గిపెట్టడిగి చుట్ట ముట్టించాడు. చాలా సేపు చూశాడు: బేరంలేదు. పన్నెండు గంటల వేళప్పుడు టౌన్లోంచి ఊరి చివరనున్న మిల్లుకు చిన్నబియ్యం మూట తీసుకొచ్చాడు. పావలా సంపాయించాడు. పావలా రిక్షా హేండిల్ బార్ కి కొట్టి ముద్దు పెట్టుకుని బనీను జేబులో పడేసుకుని బయల్దేరాడు. తిన్నగా డొంకే, రావిచెట్టు జంక్షన్ లో కొచ్చాడు. ఆ జంక్షన్ లో మామూలు బస్సులన్నీ ఆగుతాయి. అక్కణ్ణుంచి రెండు మూడు ఊళ్ళకి మట్టిరోడ్లున్నాయి. రావిచెట్టుకిందటీకొట్టుంది, కాస్తంత దూరంలో మరోపాక వుంది. అది పెద్దనాయుడి గరుగులో వుంది. అంతకు తప్పించి ఆ చుట్టుపట్ల యిళ్ళు లేవు. ఆ జంక్షన్ కు మరిడయ్యది ఒక్కటే రిక్షా. బస్సు దిగినవాళ్ళని ఆయా వూళ్ళకి తీసుకువెళుతుంటాడు. ఆయావూళ్ళ వాళ్ళని రెండుమైళ్ళ దూరంలోవున్న బస్తీకితీసుకువెళుతుంటాడు. బస్తీకి తీసుకుపోతేమనిషికి అర్ధరూపాయి. యిద్దరయితే రూపాయి. ఒకోరోజు నాలుగయిదు రూపాయిలదాకా సంపాయిస్తాడు. ఒకోరోజుఒట్టు పెట్టేవట్టు బేరం వుండదు. చినుకులు పడుతున్న ఈ మూడురోజులనుంచీ 'యవ్వారం' ఇలాగే వుంది. ఇవాళ మరీ 'గోరం'.

కుర్రాడి బరువు గుండెలకెగబోడుస్తుండగా ఇద్దరు మనుషులూ రావిచెట్టు సమీపించారు. ఆడది చిన్నరాగంతీస్తున్నట్టు పసికట్టాడు మరిడయ్య. అది రాగం కాదు శోకండం. ఆకుర్రవాడికి మూడేళ్ళుండొచ్చు. తోటకూరకాడలాగ వేలాడబడిపోతున్నాడు. మగమనిషి యాడవడం లేదు. మొహం అంతకంటే దారుణంగా వుంది. బెగులు బెగులుగా వున్నాయి వాళ్ళ చూపులు. ఆ కుర్రవాడు అసలు చూట్టంలేదు. కళ్ళు లోతుకుపోయి వున్నాయి. ఆ మొహంలో జీవకళ లేదు.

ఆ మనుష్యుల్ని పోల్చాడు. పేర్లు తెలీదు గాని వాళ్ళది కొండవార వూరు.

"బాబా కిష్టబాబా — వా బాబా— వారే" అంటున్నది తల్లి, కుర్రవాణ్ణి కదిలించి.

మగమనిషి బెగులుబెగులుగా గుండెకాయ తెగిపోయేలాగ చూస్తున్నాడు. ఏడిచినా అంతకంటె తెరిపిలావుణ్ణు అన్నట్టు చూస్తున్నాడు.

మరిడయ్యకు బోధపడిపోయింది

పట్నంలో డాక్టరు దగ్గరికెళ్ళాలి

ఆడమనిషి పయిటచెరగున పొట్లం కనపడింది

మరిడయ్యకు ధైర్యం వచ్చింది. అందులో డబ్బులుండివుంటాయి

కుర్రవాడు చావుబతుకల్లో వున్నాడంటే కుండా ముంతా అమ్మినయినా సొమ్ము పట్టుకునుంటారు.

''యేటయ్యిందేటి'' అన్నాడుమరిడయ్య, రిక్షా తారురోడ్డు మీదకుతెచ్చి.

సరిగ్గా వారం రోజులాయి కిష్ణబాబుకి జబ్బు. ఏం జబ్బు అన్నది మనకి తెలీదు. అగ్రహారంలోవున్న పంతులుగారి వైద్యం. తగ్గలేదు. ముదిరిపోయింది. పట్నం తీసుకెళిపోండి అని చెప్పేసరికి కిష్ణబాబు కాళ్ళూ చేతులూ చల్లబడిపోయాయి. మెడ వేలవేసేశాడు. అగులూ బొగులూ మంటూ పొలాలకడ్డంపడి నడిచిరోడ్డు చేరుకున్నారు. అదీ కథ. ఈ నాలుగుముక్కలూ చెబుతూ ఆడది నాలుగుసారు చీదింది. మొగమనిషి మొహంలో ఎక్కడా కత్తివేటుకి నెత్తురు లేదు. అతని పొట్ట వెన్నుకు అంటుకుపోయి. అతని కళ్ళు ఎక్కడోలోతుకుపోయివున్నాయి ఆ కళ్ళలో వెతుకుదామన్నా నీళ్ళు లేవు.

''బేగెక్కండి బేగెక్కండి'' అన్నాడు మరిడయ్య.

గాలి చల్లగా వొళ్ళు చిల్లులు పొడిచేలా వీస్తోంది.

మబ్బులు కాటుక పూసుకుని తరుము కొస్తున్నాయి, మృత్యువులాగ. పొద్దు వాల లేదు గాని రాత్రయి పోయినట్టే వుంది.

''సూడు నేస్తం, అయిదు రోడ్ల జంక్షన్‌లో సింగ్‌డాక్టర్‌కాడికి పోనీ'' అన్నాడు రిక్షాలోంచి, మగమనిషి. బుజాన్నున్న పాతతీసి కప్పాడు కుర్రాడికి. తల్లి కుర్రాడికాళ్ళూ చేతులూ తనచేతుల్తో రాస్తోంది వెచ్చదనంకోసం.

అది శీతాకాలంకాదు అది వానాకాలమూ కాదు. అది ఎండాకాలం. ఎండలు పేల్చి పేల్చి—మూడురోజులయి మబ్బులు, వానా పట్టుకుంది నిజానికది కొండరాళ్ళు పగల వలసిన గ్రీష్మఋతువు.

ముందురోజు మిగిలిన పదిపైసలూ బీడీలు కొనేశాడు. బియ్యమూట మిల్లుకు తెచ్చినందుకు సంపాయించుకున్న పావలా తోటీ, మరోపావలా అరువెట్టి రావిచెట్టు కింద టీకొట్లో ఒకరొట్టితిని టీ నీళ్ళు తాగాడు. ఆ రొట్టె మ్యూడోలునాటిదే. అయితేనేంగాక అరువిచ్చింది అంతే చాలు. అసలే టీకొట్టు పార్వతమ్మ రాకాసిది. అదిగో అల్లారొట్టె కిమించి కడుపులో మరేం లేదు. అమ్మతోడు. చంపుకు తినేసినం తొట్టు. ముందురోజు మధ్యాహ్నం గుప్పెడన్నం యింతగంజీ తాగాడు. ఆ మావులు మళ్ళీ పుత్తిగంజే. అయితే అది అతనితప్పె పట్నంనుంచి వస్తూ వస్తూ డబుల్‌జీరో మీదొక పావలా, డబుల్‌సెవెన్‌మీదొక అర్ధ రూపాయీ బ్రాకెట్టు కట్టేశాడు పావలా పుగాక్కాడ కొనేశాడు. రూపాయి చెల్లు. పెళ్ళాం తిట్టిపోసింది. యింత పుగాకుపాయ తీసి దానిచేతిలో పెట్టాడు. అది యిన్ని గంజినీళ్ళుపోస్తే తాగి కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకున్నాడు.

మరిడయ్య గబగబా రిక్షాలాగుతున్నాడు.

ఆడమనిషి అలారాగం తీస్తూనేవుంది.

మరిడయ్య బొత్తిగా ఒంటిపేగుమనిషి. కష్టం నోర్చలేడు. తనుపడలేడు. మరోడు పడితే చూడలేడు. అసలు మొదట ఈ రిక్షాకూడా తొక్కలేకపోయేవాడు.

మరిడయ్యకు చిన్న సైకిలుషాపుండేది. దానికి అనుబంధంగా సోడాకొట్టుండేది. నాలుగు సైకిళ్ళుండేవి. రెండుసైకిళ్ళు దొంగలెత్తుకుపోయారు. ఒకసైకిలు పోలీసులు దొంగ సైకిలన్న అనుమానంతో ఎత్తుకుపోయారు. మరోసైకిలు అతనే అమ్మేశాడు. సోడాకొట్టు కొన్నాళ్ళు కొడిగట్టిన దీపంలాగ సాగి సాగి చతికిలబడి పోయింది. సైకిలూ, బడ్డీ అమ్మి – నానా గడ్డీగరిచి ఈరిక్షా కొన్నాడు ఎనిమిదివందలకి, రెండేళ్ళకి అక్కడకది కారు చౌక. సైకిలుషాపు బాగున్నరోజుల్లో మరిడయ్యకి ఏర్రమ్మని ఒక ముండుండేది. దానికోసారి ఉంగరంకూడా చేయించిపెట్టాడు. మనిషి మాంచి పొంకంగావుండేది. కాని...సరే. ఏందుకొచ్చినగొడవ. అంతా చాలా పెద్దకథే వుంది.

పెద్దమదుంవరకూ వచ్చారు.

చీకటికాస్త చిక్కబడింది. పడమరన చిన్నతెల్లచీర లేకపోలేదు.

చినుకులు కాస్త పెద్దవయ్యాయి.

''నాయన్నాయన బేగెల్సి బేగెల్సి — అంటున్నాది రిక్షాలో ఆడమనిషి. మరిడయ్య మృత్యువునుశంకిస్తూనేవున్నాడు. గుండెల్లో నిండానీళ్ళు పోసేసినట్టు బరువుగా వుంది. దుఃఖంతో బాధతో వొణుకుతోంది. మరిడయ్యదిబొత్తిగా జాలిగుండె. అదిగదే యింతపనిచేసింది.

మరిడయ్యకు యిద్దరు కొడుకులూ ఒక కూతురూను. కూతురు, అమ్మవారు పోసి చూస్తూ చూస్తూ వుండగానే చచ్చిపోయింది. కూతురు చచ్చిపోయిన రోజు జ్ఞాపకం వచ్చింది మరిడయ్యకి. ఎంత

కవిత!

కళ్ళు చూపిన వాస్తవాన్ని
ఆలోచిస్తూ—
మస్తిష్కంకాలం వెచ్చిస్తే
అలజడి, సంఘర్షణల
రాపిడిలోనుంచి
పుట్టిన చైతన్యం
హృదయాన్ని కదిలిస్తే
స్పందించిన హృదయం
కదిలించిన కలం
ఉత్తేజంతో
ఉద్వేగంతో
పాడినగీతం
కవిత!

— పాయసం సుబ్రహ్మణ్యం

ఇరాన్‌లో మన డాక్టరలకు స్వస్తి

మొత్తం కాలం ప్రభుత్వానికే సేవ చేసే ఒప్పందాన్ని ఉల్లంఘించి ప్రవేటు ఆస్పత్రులు తెరుస్తున్నారన్న ఆరోపణపై ఇరాన్ 10 మంది భారత, పాకిస్తాన్ వైద్యులను బహిష్కరించిందని ఆరోగ్య శాఖా మంత్రి జనవరి 19వ తేదీన టెహరాన్‌లో ప్రకటించారు. ఈ బహిష్కరించిన వైద్యులు ప్రభుత్వం చే గ్రామాల్లో పని చేయటానికి నిర్దేశింప బడ్డారు. కాని వారు అదే గ్రామాలలో వేరే ఫీజులు తీసుకొని ప్రాక్టీసులు పెట్టారు.

స్తుతి - నిందలు

తనయందు ఎంతో భక్తిఉన్న భక్తులకైనా సరే, భగవంతుడు సులభంగా వరం ఇవ్వడు. వారెంతో బాధపడినమీదట—వారిని అనుగ్రహించడం జరుగుతుంది. సర్వసంగ పరిత్యాగంచేసిన మహామునులుఎంతో ఘోరంగా తపస్సుచేసిన తర్వాతనే అనుగ్రహించడం జరుగుతున్నది. అట్టిస్థితిలో సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్న సామాన్యులను గురించి వేరే చెప్పనక్కర్లేదు కదా ! సంసారులు తమ స్తోత్రాలవల్ల ఫలితం కానరాక పోగా, భగవంతుణ్ణి నిందించడం కూడా జరుగుతున్నది. అలా నిందించిన తర్వాతనే వాళ్ళసంకల్పం నెరవేరుతున్నది. ఆ నింద తనపై గల అపారభక్తికే సూచకమని భగవంతుడు భావిస్తాడని చెప్పవచ్చును. ఆ పరమపురుషునికి భక్తుల నిందాస్తుతులు రెండూ సమానమే !

స్తుతివల్ల తమకార్యం ఫలించకపోగా, తాము నమ్ముకున్న స్వామిని నిందించి కార్యం సాధించిన సంఘటనలు ఎన్నోఉన్నవి. వాటిలో రెండిటిని ఉదాహరణకు తీసుకోవచ్చు.

రామదాసు నామంతో ప్రఖ్యాతుడైన కంచెర్ల గోపన్న భద్రాచలంలో శ్రీరామచంద్రునకై సర్కారు సొమ్మును లక్షలకొలది ఖర్చు చేశాడు. ఆ అపరాధానికయి నిజాం ప్రభువు అతనిని చెరలోపెట్టి హింసించాడు. తన్ను రక్షించాలని రామదాసు శ్రీరాముని ప్రార్థించినా ప్రయోజనం లేక పోయింది. విసుగెత్తి నిందించిన తర్వాతనే రామ లక్ష్మణులు రామదాసుని భృత్య వేషంతో అర్ధరాత్రి తానీషాకు పైకం చెల్లించి భక్తునికి విడుదల కలిగించారు.

సింహాచల క్షేత్రాన్ని దోచుకొనుటకు తురకలదండు విశాఖపట్నం మీదుగావస్తున్న సమాచారం ముందుగా తెలిసి గోగులపాటి కూర్మనాథకవి శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో దీక్షతో కూర్చుండి సింహాద్రి నారసింహశతకం చెప్పడం ప్రారంభించాడు. మొదట్లో దేవుణ్ణి స్తుతిస్తూ, ప్రజలనూ, తన దేవాలయాన్నీ రక్షించాలని ప్రార్థించాడు. ప్రయోజనం లేకపోయింది. దోపిడిదండు (తుమ్మెదల) మెట్టను సమీపిస్తున్నట్లు తెలిసింది. తర్వాత, కవి ఉద్రేకంతో స్వామిని నిందిస్తూ పద్యాలుచెప్పాడు. ఆ దేవదేవుడు అనుగ్రహించి తుమ్మెదల దండును పంపి, తురకల దండును అక్కడి నుండి వెంట తరిమి అపాయం తప్పించాడు తర్వాతనే ఆ మెట్ట తుమ్మెదల మెట్ట అని పేరు పొందింది.

విగ్రగా వుండేదో. బ్రతికివుంటే నేటికి పన్నెండేళ్ళుణ్ణా. పోనదలా యింనా? రెండో కొడుకును లారీ మట్టించేసింది. వాడు ఎప్పుడూ కునికిపాట్లు పడుతూనే వుండేవాడు. ఏ రోగమూ లేకపోయినా రోగిష్టిలాగా వుండేవాడు. ఎనిమిదేళ్ళ వయసులో ఆలాగయిపోయాడు. అర్నెల్లు తిప్పితిప్పి వెయ్యి రూపాయిలిస్తామని – అన్ని కమిషన్లు పోనూ ఆరొందలు చేతిలో పెట్టారు. పోయిన కొడుకు ఎలాగూరాడు, ఎదవ ఆరొందలు ఎందుకు పుచ్చుకున్నావూ, పారేఅళ్ళ మొహాన్నే అన్నది పెళ్ళాం. అవున్నిజమే. మరి డబ్బో! ఈనాటికి ఒంటి ఆడదానికి తెలీదుగాని మరాడబ్బుతోనే ఎర్రమ్మకి నీలం పొడి వేసిన ఉంగరం వేయించి– మాంచి చీర కొన్నాడు తక్కిన సొమ్ము జలసా చేయించాడు. ఇప్పుడా భోగట్టా జ్ఞాపకం వచ్చి చాలా పశ్చాత్తాపంతో ఛీ ఛీ—నేనేం

చీకటి చినుకులు

మనిషిని అనుకున్నాడు మరిడయ్య.

''పదనాయినా—తరుముకెళ్ళి పోస్తుంది. రొజ్జగాలొకటి'' అన్నది రిక్షాలోంచి ఆడ మనిషి.

''నాయనా కిష్ణబాబూ– సూడవా – నాదుక్కు సూడవా'' అంటున్నాదా తల్లి హృదయవిదారకంగా.

''పళ్ళకోయే—యిప్పుడు కదిల్నాడుగాడా— అన్నిటికే ఆ బగమంతుడున్నాడు. సింగు డాట్టరు సెయ్యి సలవన నయమయిపోయిందా...'' అని ఆగేడు. అవ్వకపోతేనో అన్న ప్రశ్న వేసుకుందుకు ధైర్యం చాల్లేదు. మొహం దాచేసుకున్నాడు. మెడ పొడుగు కావడంవల్ల గడ్డం గుండెల కానీసింది. మెడ నులిమీసిన కోడిలా వున్నాడు.

మరిడయ్య రిక్షాదిగి లాగడం ప్రారంభించాడు. అక్కణ్ణించి వూడా వాళ్ళ పెట్రోలు బంకు దాకా అంతా ఎగువే. బస్తీలో దీపాలు అల్లంత దూరంలో మిల మిల లాడుతూ కనబడుతున్నాయి. శ్రీరాజా టాకీస్‌లో లొలాటకి రికార్డులు వేస్తున్నారు. సినిమాకు వెళ్ళే జనం పరుగులాగ నడుస్తూ రిక్షా దాటిపోయారు. వాళ్ళు సినిమా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు.

మరిడయ్య పెద్దకొడుకు ఒకత్తెని తీసుకుని లేచిపోయాడు. వైజాగ్‌లో వోడల రేవులో మూటలు మోసుకుంటున్నాడని, యిప్పుడు వాడి పని బాగానే వుందనీ పట్నం నుంచి వచ్చిన బ్రహ్మం చెప్పాడు. యదవ— యదవన్నర యదవ. తల్లినీ, తండ్రినీ సూడనోడు ఆడూ వొక్కొడుకేనా– తూ– మరిడయ్యకు కష్టం వేసింది. ఉన్నట్టుండి ఈ బ్రతుకెంతో భారంగానూ మొయ్యడం అసాధ్యంగానూ కనపడింది. ఊపిరి బిగబట్టి

బరువు లాగుతున్నాడు. బస్తీలోకి రానే వచ్చాడు. అల్లా కనిపించేదే పూరా వాళ్ళ బంకు. ఓపిక వట్టాడు గబగబా పరుగు లాగ నాలుగడుగులు లాగి గబుక్కున రిక్షా సీటెక్కి తొక్కడం ప్రారంభించాడు. అమ్మయ్య! రిక్షాలో కూచున్న మనుషు లిద్దరూ చాలా బరువున్నట్టు కనిపించారు. కాదు కాదు ఆ గుంటడు బరువెక్కిపోయుంటాడు. చచ్చిపోయాక మనుషులు బరువెక్కిపోతారట. మరా కుర్రాడు... ఛ... తప్పుడాలోచనలు ...

సింగు డాక్టరు సెయ్యిబడితే బతీకాడా? మళ్ళీ తానే వాళ్ళని రావిచెట్టు జంక్షన్‌లో దిగబెట్టాడా ?— వాళ్ళప్పుడు సంతోషించి మరో పావల్డబ్బులు పారీరా ? ఇలా ఆలోచించుకుంటూ రిక్షా జోరుగా పోనిచ్చాడు.

కాటికలాంటి చీకటిని కరెంటు దీపాలు తరిమితరిమి కొడుతున్నాయి. అయిదు రోడ్ల జంకన్‌లో అంతా పట్టపగల్లా వుంది.

రిక్షా పక్కకితీసి ఆపాడు మరిడయ్య.

ఆ పక్క డాబా యిల్లే సింగు డాక్టరు ఆస్పత్రి.

సాయంత్రం ఏడుగంటల సమయం. బస్తీరోడ్లన్నీ మాంచి రదీగా వున్నాయి. చినుకులులేవు ఉండీ ఉండీ ఒక్కొక్క తుంపర. ఆ చినుకుల్ని ఎవ్వరూ లెక్క చెయ్యడం లేదు.

ఇద్దరూ రిక్షా దిగేరు.

ఆడమనిషి పయిటచెంగున పొట్లం విప్పి "యిందా డబ్బులు" అన్నాది ఫెలిమిటితో.

"నా డబ్బులిచ్చి" అన్నాడు మరిడయ్య.

"యిచ్చేస్తాం నాయనా — కొడుకును డాక్టరుబాబుకు సూపించనియ్యవా" అంది గట్టిగా ఏడుస్తూ, ఆడమనిషి. "ఒక్క సిటం నుంచో" అని కూడా అంది.

మరిడయ్యకు మరినోరు పెగల్లేదు.

ఇద్దరూ సింగు డాక్టరు ఆస్పత్రిలోకి గబగబా తూలుతూ, దు:ఖంతో వాలిపోతూ వెళ్ళారు.

మరిడయ్య రిక్షాలో కూచుని చుట్ట ముట్టించాడు. పదిహేనుపైసలు —అంతే— పదిహేనుపైసలుంటే చాలు టీ తాగును. ఏడీ ఎవరున్నాడు యిచ్చేదాత. మరిడయ్యకి ఏభైయ్యేళ్ళు దాటాయి. మనిషి బొద్దుగా పుష్టిగా వున్నట్టు కనపడతాడు. కాని ఒట్టి ఒంటిపేగు మనిషి. కష్టం వోర్చ లేడు. చూడలేడు. రోడ్డువార చచ్చిపోయిన కుక్క కనపడితే కడుపులో దేవేసినట్టయి పోయి అన్నంనోట్లో పెట్టుకోలేడా పూట. శవాన్ని చూసే చాలు మనసు చెదిరిపోతుంది.

మరిడయ్యకి క్షాలోనేకునుకుపట్టేసింది.

*　　*　　*

రాత్రి తొమ్మిది గంటలయి వుంటుంది. తొలి సినిమా వదల్లేదు.

మరిడయ్య రిక్షా పట్నంలోంచి బయలుదేరి రయ్యిరయ్యిమని రావిచెట్టు జంక్షన్ వైపు శరవేగంతో పరుగుతీస్తోంది. ఇప్పుడది బరువుగా లేదు. తేలిగ్గా వుంది. అంతా డౌను. పెద్దమదుం. దాటిందాకా ఫెడల్ మీద కాలు వెయ్యక్కర్లేదు.

చచ్చిపోయినవాళ్ళు బరువెక్కరు. తేలిగ్గానే వుంటారు. అ కుర్రాడు చాలాసేపయి చచ్చిపోయాడు. సింగు డాక్టరు చాలామంచి వాడు. చేతిచలవగలవాడు. కాని ప్రాణం పట్టుకురాలేడుగద ! కుర్రాడితండ్రి ఇచ్చిన అయిదురూపాయలకే — మంచియింజక్షన్, కరక్టయిన యింజక్షన్ కూడా యిచ్చాడు. కాని చెయిదాటిపోయింది అంతాను.

ఆడమనిషి శోకంకాలకు అంతులేదు. తండ్రిముఖం దు:ఖంతో లోతుకుపోయింది.

మరిడయ్య భయపడ్డంతా అయింది.

చంటికుర్రాడి శవంతో పట్నంలో వాళ్ళెక్కడుంటారు ? మరంచేత వీళ్ళని తీసుకెళ్ళి యిల్లుజేర్చేస్తే యాడవనన్నా ఏడుస్తారు.

తండ్రికళ్ళల్లోంచి తడి దీపాలవెలుతురులో తళుక్కున కనిపించింది మరిడయ్యకు వాళ్ళకంటె ముందు అతనికి దు:ఖం ఆగడంలేదు.

ఒక్క నిమిషం చూశాడు.

రిక్షా ఎక్కండన్నాడు. అంతకంటే అతనేం చెయ్యగలడు?

రిక్షా తేలిగ్గా ఎగురుతోందా అనిపిస్తోంది. డబ్బుల్లేని మనుషులు తేలిగ్గా వుండరూ? కడుపులోపేగులు చుట్టుకుపోతున్నాయి. నిండిపోయి కట్టలు తెగడానికి సిద్ధంగావున్న చెరువులావుంది మనసు.

చీకటి మత్యువులాగ చిక్కగా వుంది.

చినుకులు రాల్తూనే వున్నాయి.

మరిడయ్య ఆకాశంవేపు చూశాడు. ఒక్కచుక్కకూడా కనపడ్డంలేదు. లోకాన్నంతా చీకటి మింగేసినట్టు భయంకరంగా వుంది. నక్షత్రాలు మాడిపోయి చీకట్లో కలిసిపోయి వుంటాయి.

చినుకులు అలా రాల్తూనే వున్నాయి.

చీకటికరిగి చినుకులుగా పడుతున్నాయా అనిపిస్తోంది.

కిష్టబాబు శవాన్ని పట్టుకుని రిక్షాలోంచి తల్లి ఏడుస్తూనేవుంది. ఆ ఏడుపుతో నక్కల అరుపులు లయ కలుపుతున్నాయి.

మృత్యువుకు జాలిలేదు.

మృత్యువుకు తిరుగులేదు.

చీకటికరిగి చినుకులు రాల్తున్నాయి